క్లుప్తంగా

వేపకంపల్లి ఎంపీటీసీ స్థానానికి రెండు నామినేషన్లు

కారెంపూడి: మండలంలోని వేపకంపల్లి ఎంపీటీసీ స్థానానికి శుక్రవారం రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి తెలిపారు. టీడీపీ అభ్యర్థులుగా బొల్నేడి కనకదుర్గ, బొల్నేడి హైమావతి నామినేషన్లు వేశారన్నారు. గతంలో ఎంపీటీసీగా కొనసాగిన వైఎస్సార్ సీపీకి చెందిన కోకా అక్కమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ స్థానంలో ప్రస్తుతం ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. వేపకంపల్లి ఎంపీటీసీగా టీడీపీ నాయకుడు బొల్నేడి శ్రీనివాసరావు సతీమణి కనకదుర్గ, తల్లి హైమావతి ఇద్దరూ భారీ ర్యాలీగా తరలివచ్చి నామినేషన్లు వేశారు.

'మురుగు' రోడ్డు



దాచేపల్లి: అద్దంకి– నార్కెట్ పల్లి హైవేపై మండలంలోని పొందుగలలో రోడ్డుపైనే మురుగు నీరు పారుతోంది. ఈ గ్రామంలో హైవే రోడ్డు నిర్మాణం ఓ వైపు చేపట్టలేదు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైకి చేరింది. పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి మురుగుకాల్వలు సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు గ్లాసులు అందజేత

దాచేపల్లి: మండలంలోని ముత్యాలంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు దాతలు శుక్రవారం గ్లాసులు అందజేశారు. హైస్కూల్లో అందిస్తున్న రాగి జావను తాగేందుకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన మర్రెడ్ల మట్టారెడ్డి, వెంకమ్మ కుమారుడు శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు రాగి జావ తాగటానికి రూ.5 వేలు విలువ చేసే 125 స్టీల్ గ్లాసులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎమ్ ఆర్.వి. సుబ్బారావు, ఉపాధ్యాయులు సైదారావు, వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మి, జ్యోతిర్మయి, బుల్లెమ్మ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

మండల ప్రత్యేక అధికారి రాంబాలజీరెడ్డి



రెంటచింతల: క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని మండల ప్రత్యేక అధికారి రాంబాలజీరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఆయన గ్రామంలోని వివిధ సంక్షేమ వసతి గృహాలను, ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, మిట్టగుడిపాడు సమీపంలోని కస్తూరిబా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో భాగంగా విద్యార్థుల సమగ్ర, సుస్థిరమైన అభివృద్ధికి సంక్షేమ వసతి గృహాలలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. తొలుత విద్యార్థులకు తయారు చేసిన ఆహార పదార్థాలను, బియ్యాన్ని, వంట గదులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ-2 వై.శివ నాగేశ్వర రావు, ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్, హాస్టల్ వార్డెన్లు నూరెల్లా బేగ్, అరుణ పాల్గొన్నారు.

6512 మందికి అన్నదాత సుఖీభవ

శావల్యాపురం: అన్నదాత సుఖీభవ పథకం, పీఎం కిసాన్ పథకానికి సంబంధించి 6512 మంది లబ్ధిదారులు ఎంపికైనట్లు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలానికి రూ.4 కోట్ల 56 లక్షలు మంజూరు చేసిందన్నారు.
అర్హత కల్గియున్న రైతు బ్యాంకు ఖాతాలో నగదు ప్రభుత్వం శనివారం జమ చేయనున్నట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో బీపీటీ రకం 5204, కేఎస్ఎం 1638 వరి విత్తనాలు రాయితీపై రైతులకు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. బీపీటీ 5204 రకం వరి విత్తనాలు 25 కేజీల సంచి రూ.950 చెల్లించాలన్నారు.

ఘనంగా పోలేరమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ తల్లి దేవాలయం ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు వేద మంత్రాలు, మేళతాళాలు నడుమ సంబరాలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌ను నూతన వస్త్రాలు, పూలదండలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, జనసేన నాయకులు నాగ శ్రీసురాయల్ తదితరులు పాల్గొన్నారు. భారీ అన్నదాన సంతర్పణ చేశారు.



రెంటచింతలలో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన కన్యకాపరమేశ్వరి



పాలువాయి జంక్షన్ వద్ద ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



సత్రశాల దేవస్థానంలో ప్రత్యేక అలంకారంలో భ్రమరాంభికాదేవి



పిడుగురాళ్లలో కనకదుర్గమ్మకు అలంకరణ



దాచేపల్లిలో ప్రత్యేక అలంకరణలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో అమ్మవార్ల ఆలయాలలో రెండో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రధాన అర్చకులు శ్రిష్టి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో, తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అర్చకులు ఓరుగంటి మారుతి శర్మ నేతృత్వంలో, చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో అర్చకులు అనీల్‌కుమార్‌శర్మ, సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో శివయ్య శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వాసవి అమ్మవారికి ఆర్యవైశ్య మహిళాలు స్థానిక బ్రహ్మయ్యబావి సెంటర్ నుంచి మేళతాళాలతో గ్రామోత్సవంగా తరలి వెళ్లి సారె సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ భక్తులకు శ్రావణ శుక్రవారం రోజు పూజలు చేసిన కుటుంబాలకు సకల సంపదలు, సుఖ సంతోషాలు కలుగుతాయని వివరించి తీర్థప్రసాదాలను అందజేశారు. దేవస్థానం అధ్యక్షులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని పాలువాయి జంక్షన్ వద్ద ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రెంటచింతలలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

పండ్లతో కనక దుర్గమ్మకు అలంకరణ

పిడుగురాళ్ల: పట్టణంలోని భవానీ నగర్‌లోని అమ్మవారి ఆలయంలో కనక దుర్గమ్మను పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రావణ మాసం రెండో శుక్రవారం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు పొందారు.



దాచేపల్లిలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

అమ్మవారికి ప్రత్యేక పూజలు

దాచేపల్లి: స్థానిక వాసవి కన్యాకాపరమేశ్వరి ఆలయం ఆలయంలో శ్రావణమాసం రెండో శుక్రవారం కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మాశెట్టి బుజ్జి పర్యవేక్షణలో భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

ఆర్టీసీలో డ్రైవర్ ఉద్యోగావకాశాలు



మాచర్ల రూరల్: కాంట్రాక్టు పద్ధతిలో స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్ ఉద్యోగాలకు అవకాశం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15 నుంచి ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ప్రారంభమవుతున్న దృష్ట్యా డిపో నుంచి అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వీటికి డ్రైవర్ల కొరత ఉన్నందు వలన కాంట్రాక్టు పద్ధతిలో డ్రైవర్లను నియమించేందుకు అధికారులు ఆదేశించారన్నారు. ఈ నేపథ్యంలో 18 నెలల హెవీ లైసెన్స్, అనుభవం ఉన్న డ్రైవర్లు, ఆధార్ కార్డు, ఆర్టీఓ కార్యాలయం నుంచి జారీ చేసిన ట్రాక్ రికార్డు తీసుకొని శనివారం ఉదయం 11గంటలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మాచర్ల రూరల్: అర్హతే ప్రమాణంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 13వ వార్డు, సచివాలయం వద్ద వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ లక్ష్మి, టీడీపీ నాయకులు బండ్ల బ్రహ్మం, చందూ గౌడ్, కృష్ణ ఉన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

మాచర్ల రూరల్: ఇరవై ఏళ్ళ నుంచి హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబర్ సాతులూరి మరియదాసు కోరారు. శుక్రవారం ఈ మేరకు వారు రాష్ట్ర హౌసింగ్ ఎండీ శివప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. ఇందిరమ్మ గృహాల నిర్మాణం నుంచి టిడ్కో గృహాలు, జగనన్న కాలనీలు నిర్మాణం వరకు హౌసింగ్ ఉద్యోగులు చాలీచాలని జీతాలతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారని, ఉద్యోగుల భద్రత కోసం చర్యలు తీసుకొని హెచ్ఆర్ పాలసీతో పాటు టీఏ, డీఏ ఇప్పించి తమ కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా అమరావతిలో రాష్ట్ర హౌసింగ్ చీఫ్ ఇంజినీర్ వేణుగోపాల్, వర్ల కుమార్ రాజాను కలిసి వినతి పత్రాలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అలి, మహేంద్ర, ప్రభుదాసు, శ్రీనివాసరావు తదితరులున్నారు.



హౌసింగ్ ఎండీ శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

చేతిరాత బంగారు భవిష్యత్‌కు పునాది

చేతిరాత నిపుణులు ఉప్పాల రామమోహనరావు

శావల్యాపురం: చేతిరాత బంగారు భవిష్యత్‌కు పునాది వేస్తుందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహనరావు అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బెజవాడ చారిటబుల్ ట్రస్టు వారి సారధ్యంలో విద్యార్థులకు చేతిరాతపై శిక్షణ తరగతులతోపాటు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు అందమైన చేతిరాత ద్వారా బంగారు భవితకు పునాది వేసుకోవచ్చని అన్నారు. ఇప్పటి వరకు కాకినాడ, కర్నూలు, ఏలూరు, ప్రకాశం, నెల్లూరు తదితర ప్రాంతాల్లో 5300 ఉపాధ్యాయుల సారధ్యంలో 65 వేల మంది విద్యార్థుల చేతి రాతలో విప్లవం వచ్చేలా చేశామన్నారు. ఇందులో భాగంగా ఒక్కో ఉపాధ్యాయుడు 10 మంది విద్యార్థులను దత్తత తీసుకొని చేతిరాతలో తర్ఫీదు ఇస్తారన్నారు. అలాగే క్యాలిగ్రాఫీ చరిత్రలో మొదటసారిగా క్యూఆర్ కోడ్ సహాయంతో హ్యాండ్ రైటింగ్‌ని ప్రతి ఒక్కరూ సులభంగా నేర్చుకొనేలా వినూత్న పద్ధతిలో హ్యాండ్ బుక్ రూపొందించామన్నారు. కార్యక్రమంలో బెజవాడ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, పాతశాల సీనియర్ ఆంగ్ల ఉపాధ్యాయులు బెజవాడ నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయురాలు బొడ్డు విజయలక్ష్మి,, చేతిరాత శిక్షణ నిపుణులు చేపూరి రమేష్, సత్యనారాయణ, టి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న చేతిరాత నిపుణులు రామమోహనరావు

ఉపాధ్యాయులపై పీ–4 కార్యక్రమాన్ని రుద్దడం సరికాదు

ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు

చిలకలూరిపేట: ఉపాధ్యాయులపై పీ–4 కార్యక్రమాన్ని బలవంతంగా రుద్ద రాదని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఫ్యాప్టో భాగస్వామ్య ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యాన నరసరావుపేటలోని గాంధీపార్కు వద్ద శనివారం నిర్వహించనున్న ధర్నాకు సంబంధించి సన్నాహక సమావేశం పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నూతనంగా అప్‌గ్రేడ్ అయిన స్థానాలను కోరుకున్న ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలన్నారు. జిల్లా కలెక్టర్ పూల్ ద్వారా వెంటనే పోస్టింగులు ఇవ్వాలని కోరారు. 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. 30శాతం మధ్యంతర భృతి ప్రకటించటంతోపాటు, రిటైర్ అయిన వారికి గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు 3 పెండింగ్ డీఏలను ప్రకటించి, డీఏ బకాయిలను, 11వ పీఆర్సీ బకాయిలను, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్ల సాధన కోసం శనివారం నరసరావుపేటలోని గాంధీ పార్క్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు వినుకొండ అక్కయ్య, మేకల కోటేశ్వరరావు, వి జయప్రకాష్, మక్బూల్ బాషా, దుర్గాప్రసాద్, జి కోటేశ్వరరావు, సతీష్‌కుమార్, బొంత రవి, షేక్ మస్తాన్‌వలి, చావల మల్లేశ్వరరావు, ఎం శారద పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఎంఈఓ బ్రహ్మేశ్వరరావు

రొంపిచర్ల: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎంఈవో డి.బ్రహ్మేశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాదక ద్రవ్యాలు నిరోధక కమిటీల ఏర్పాటు, దూర విద్యా విధానంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణకు పాఠశాలల్లో కమిటీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మాదక ద్రవ్యాలు వాడకం వల్ల మత్తుకు బానిసై, విచక్షణ జ్ఞానం కోల్పోతారన్నారు. మాదక ద్రవ్యాలకు విద్యార్థులను దూరంగా ఉండే విధంగా ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు బాధ్యత వహించాలని అన్నారు. దూరవిద్య ద్వారా పదో తరగతి, ఇంటర్, డిగ్రీ కోర్సులను అభ్యసించవచ్చని అన్నారు. ఈనెల 7వ తేదీ వరకు జరిగే తల్లిపాల వారోత్సవాల గురించి తల్లులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల నిరోధక కమిటీ ఏర్పాటుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీఎం. సుభానీ, ఏఎస్ఐ కిషోర్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



బాషాకు డాక్టరేట్ అభినందనీయం



పిడుగురాళ్ల: బాషాకు డాక్టరేట్ రావటం అభినందనీయమని ముస్లిం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. పట్టణంలోని మాంటిస్సోరి స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాషాకు ఢిల్లీలోని ఎంబీఆర్ యూనివర్సిటీ సైకాలజీలో డాకరేట్ ప్రకటించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ముజీబ్, ఉపాధ్యక్షులు ఆరీఫ్, మున్నా, గోల్డ్ సైదా, ఇర్షాద్, గోలీయాత్ జమాల్, ముస్తఫా, జానీబాషా, రఫీ, అహ్మద్ బాజీ, అమీర్, బాషా, తాజుద్దీన్, గ్యాస్ సైదా, వరం, గోపి పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత



రెంటచింతల: పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమని ఎస్టీయూ జిల్లా కౌన్సెలర్, హెచ్ఎం లేళ్ల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ కాలనీలోని ఎంపీపీఎస్‌లో గొట్టం రామ కోటిరెడ్డి, బోయ వెంకటరెడ్డి, లేళ్ల పేరయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు గొట్టం నరేంద్రరెడ్డి, సతీష్ రెడ్డి, కుమార్తెలు బోయ పద్మ, శ్రీలత, మనవుడు లేళ్ల విష్ణువర్ధన్ ఒక్కొక్క పేద విద్యార్థికి రూ.10 వేల చొప్పున ఇద్దరికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

బీసీ హాస్టల్‌లో ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమం

నూజెండ్ల: విద్యార్థులు వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకనేందుకు శ్రద్ధ చూపాలని మండల వైద్యాధికారి వహీదా రెహమాన్ అన్నారు. నూజెండ్లలోని బీసీ హాస్టల్‌లో వైద్య ఆరోగ్య సిబ్బంది ఫ్రైడే.. డ్రై డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైద్యాధికారి వహీదా రెహమాన్ మాట్లాడారు. అనంతరం నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బీసీ హాస్టల్ వార్డెన్ ప్రభాకర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ బాబు, హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఏఎన్ఎంలు ఆదిలక్ష్మి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

మాచర్ల రూరల్: సమాజంలో ప్రతి ఒక్కరూ పౌర హక్కుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, హక్కులకు భంగం కలిగితే ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చునని తహసీల్దార్ బద్దెల కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లిలో దళిత వాడలో నిర్వహించిన పౌర హక్కుల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్య ద్వారానే ఆర్థిక అసమానతలు తొలుగుతాయని, ప్రతి ఒక్కరూ తమ చిన్నారులకు విద్యనందించి ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని ఆయన కోరారు. బీఆర్ అంబేడ్కర్, రాజ్యాంగంలో పౌరులందరికీ సమాన హక్కులు కల్పించారని, ఎటువంటి వివక్ష లేకుండా స్వేచ్ఛగా జీవించాలని కోరారు. దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ దళిత హక్కులకు ఎవరైనా భంగం కలిగితే తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్ళాలన్నారు. ఎస్సీ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. భీమ్ సేన రాష్ట్రాధ్యక్షుడు పేరుపోగు జార్జి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై అవగాహన లేక దాడులకు, వివక్షకు గురవుతున్నారని, వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి, ఆర్ఐ ఇంటూరి అనిల్ కుమార్, వీఆర్ఓ కాలేషా వలి, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ కిరణ్ కుమార్

స్మార్ట్ మీటర్ల వినియోగాన్ని వ్యతిరేకించాలి

పిడుగురాళ్ల: స్మార్ట్ మీటర్ల వినియోగాన్ని ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం నాయకులు కోరారు. పట్టణంలోని కళ్లం టౌన్‌షిప్‌లోని వివిధ అపార్మెంట్స్, ఎస్టీ కాలనీలో సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు షేక్ బాబు మాట్లాడుతూ.. ప్రజలపై విద్యుత్ భారాలు మోపుతున్నారని చెప్పారు. కార్పొరేట్లకు దోసి పెట్టేందుకే స్మార్ట్ మీటర్లు అని పేర్కొన్నారు. ఆగస్టు 5వ తేదీ గాంధీనగర్ సచివాలయం వద్ద జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, మహిళా సంఘం నాయకురాలు దేవళ్ల భూలక్ష్మి, కాలనీ వాసులు ఏక్ కాసింబి, చల్ల కోటమ్మ, షేక్ మౌలాలి, తుక పుల్లమ్మ, చల్ల ప్రమీలా, తురక పెద్దపుల్లమ్మ, చల్ల వీరయ్య, గొడుగు రాంబాబు, రామ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడల్లో సంసిథ్ స్కూలు విద్యార్థుల ప్రతిభ

శావల్యాపురం: క్రీడల ద్వారా మానసిక ధైర్యం, పట్టుదల, శారీరక వికాసం మెరుగుపడతాయని సంసిథ్ స్కూల్ ప్రిన్సిపాల్ సాగర్‌బాబు అన్నారు. శుక్రవారం సంసిథ్ స్కూల్లో క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించే కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సాగర్‌బాబు మాట్లాడుతూ కూచనపల్లి గీతాంజలి స్కూల్ (సీబీఎస్ఈ) జరిగిన జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావటం అభినందనీయమన్నారు. అండర్ 10 విభాగంలో షారుక్ రజత, అండర్–12 విభాగంలో యశ్వంత్, భవానీ ప్రసాద్‌లు రజత పతకాలు సాధించారన్నారు. అండర్–14 విభాగంలో లక్ష్మీ శృంగేరి కాంస్య పతకం, హంస వర్షిత రజత పతకం, సయ్యద్ హర్షద్ బంగారు పతకాలు సాధించారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కె.నాగరాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పేట ఇన్‌చార్జి డీఎస్పీగా వెంకట రమణ



నరసరావుపేటటౌన్: నరసరావుపేట ఇన్‌చార్జి డీఎస్పీగా ఎం.వెంకటరమణను నియమించారు. ఇప్పటి వరకు నరసరావుపేట డీఎస్పీగా పనిచేసిన కె. నాగేశ్వరరావు గురువారం ఉద్యోగ విరమణ పొందిన విషయం విదితమే. ఆయన స్థానంలో ప్రభుత్వం ఎవ్వరినీ నియమించలేదు. దీంతో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.వెంకట రమణను ఇన్‌చార్జి డీఎస్పీగా నియమిస్తూ శుక్రవారం పోలీస్ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

199 మందికి నూతన వితంతు పెన్షన్లు

నాదెండ్ల: పెన్షన్ తీసుకునే భర్త చనిపోతే తదుపరి నెలలో తప్పనిసరిగా భార్య పెన్షన్ పొందవచ్చని ఎంపీడీవో స్వరూపరాణి చెప్పారు. నాదెండ్ల పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఎన్‌టీఆర్ భరోసా వితంతు పెన్షన్లను పంపిణీ చేశారు. మండల పరిధిలో 199 మంది కాగా, ఒక్క నాదెండ్ల గ్రామంలోనే 35 మందికి అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు, కార్యదర్శి సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



నరసరావుపేటరూరల్: ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏఎం రెడ్డి ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం పెట్లూరివారిపాలెంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని క్యాన్సర్ కారణాలు, లక్షణాలు, నివారణ మార్గాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతిశ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదకరమైన వ్యాధి అయినప్పటికి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నివారించవచ్చని తెలిపారు. పొగ తాగడం, కాలుష్యం, జీవనశైలిలో మార్పులు వంటి అంశాలు క్యాన్సర్‌కు దారితీస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్‌భూషణ్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ డి.అశోక్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ, మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com